జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963061761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 13-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 192 పేజీలు: 4 వెల : రూ.7


# ప్రేమించలేదని..



* ట్రిపుల్ ఐటీ విద్యార్థి బలవన్మరణం * వసతి గృహంలో మూడో ఫ్లోర్ నుంచి దూకిన ప్రవీణ్ నాయక్ * రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి * ప్రేమను తిరస్కరించిందని మనస్థాపంతోనే ఆత్మహత్య * మృతుడిది ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం * దర్యాప్తు చేస్తున్న పోలీసులు * కళాశాలను సందర్శించి ఆరా తీసిన ఎమ్మెల్యే ఎన్ఈఆర్ * సంతాపం వ్యక్తం చేసిన మంత్రి అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 12 (వార్త):** తాను ప్రేమించిన అమ్మాయి కాదన్నదని అనడంతో ప్రవీణ్ నాయక్ మనస్తాపంతో నిరాశతో ఉండేవాడు. ఇటీవల తన జీ మెయిల్‌లో 'ది ఎండ్' అని కూడా రాసుకున్నాడు. అయితే ఆత్మహత్య చేసుకుంటాడని తాము ఊహించుకోలేదని తోటి స్నేహితులు చెబుతున్నారు. ప్రేమ వైఫల్యమే ఈ ఘటనకు కారణమని పోలీసులు కూడా తమ ప్రాథమిక దర్యాప్తులో తేల్చేశారు. రెండేళ్ల కిందట ఇదే క్యాంపస్‌లో ఓ విద్యార్థిని వసతి గృహంలోనే ఆత్మహత్యకు పాల్పడటం గమనార్హం.

ఎచ్చెర్ల మండలం షేర్‌మహ్మద్‌పురంలోని ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ విద్యార్థి బుధవారం అర్ధరాత్రి వసతి గృహం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడాడు. పోలీసులు, విద్యార్థులు అందించిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా పుల్లల చెరువు ప్రాంతానికి చెందిన రమావత్ ప్రవీణ్ నాయక్ (19) మూడేళ్ల కిందట శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీలో చేరాడు. రెండేళ్ల పీయూసీ తర్వాత ప్రస్తుతం సివిల్ ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలోకి వచ్చాడు. బాలుర వసతి గృహం-1 మూడో అంతస్తులోని ఓ గదిలో ప్రవీణ్‌తో పాటు మరో ఆరుగురు ఉంటున్నారు. ఇంటర్నల్ పరీక్షలు జరుగుతుండటంతో వారంతా అర్ధరాత్రి 12 గంటల వరకు చదువుకున్నారు. అనంతరం నిద్రకు ఉపక్రమించారు. ఏమైందోగాని ప్రవీణ్ రాత్రి 1.30 గంటలకు లేచి అదే అంతస్తులోని కిటికీ నుంచి దూకేశాడు. పెద్ద శబ్దం రావడంతో తోటి విద్యార్థులు వెళ్లి చూడగా.. ప్రవీణ్ తీవ్ర గాయాలతో కనిపించాడు. వెంటనే వారు హాస్టల్ సిబ్బందికి, ఉన్నతాధికారులకు సమాచారం తెలియజేశారు. హుటాహుటిన ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ డా.కె.వి.జి.డి.బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, పలువురు అధ్యాపకులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే కొన ఊపిరితో ఉన్న విద్యార్థిని రిమ్స్‌కు అంబులెన్స్‌లో తరలించారు. చికిత్స పొందుతూ ప్రవీణ్ మృతి చెందాడు. విద్యార్థి తల్లిదండ్రులు విజయాబాయ్, రవీంద్రనాయక్‌లకు పోలీసులు, వర్సిటీ అధికారులు సమాచారం అందజేశారు. డీఎస్పీ వివేకానంద, సీఐ అవతారం, ఎస్ఐ వి.సందీప్‌కుమార్ ట్రిపుల్ ఐటీకి వచ్చి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేశారు.

## విద్యార్థి మృతిపై ఎమ్మెల్యే ఎన్ఈఆర్ ఆరా

విషయం తెలుసుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. వసతి గృహంలో విద్యార్థి గదిని పరిశీలించారు. మూడో అంతస్తులో కిటికీకి తలుపు లేకపోవడాన్ని గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళతామన్నారు.



## ప్రేమ వైఫల్యమే కారణం: డీఎస్పీ వివేకానంద



ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్ నాయక్ ఆత్మహత్యకు.. ప్రేమ వైఫల్యమే కారణమని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్‌నాయక్ ఆత్మహత్య ఘటనపై నైట్‌వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. సీఐ ఎం.అవతారం విచారణ చేపట్టారని తెలిపారు. కళాశాలలో ఓ అమ్మాయిని ప్రవీణ్ నాయక్ ప్రేమించాడని, ఆ విషయం ఆమెకు చెప్పగా తిరస్కరించడం మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. తల్లిదండ్రులతోపాటు, కళాశాలల్లో విద్యార్థులను కూడా విచారిస్తున్నామన్నారు. సమావేశంలో రణస్థలం సీఐ ఎం.అవతారం పాల్గొన్నారు.

## నివేదిక ఇవ్వండి:ఎస్టీ కమిషన్ చైర్మన్

శ్రీకాకుళంలో ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్ నాయక్ మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డి వి జి శంకరరావు విచారం వ్యక్తం చేశారు. విద్యార్థిమృతిపై కళాశాల యాజమాన్యం, జిల్లా యంత్రాంగం తో గురువారం ఆయన మాట్లాడారు. సమగ్ర నివేదిక అందజేయాలని జిల్లా యంత్రాంగాన్ని కోరారు. ప్రవీణ్ నాయక్ కుటుంబానికి కమీషన్ చైర్మన్ డివిజి శంకరరావు సంతాపం తెలిపారు.

## మంత్రి అచ్చెన్న సంతాపం

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో విద్యార్థి మృతి రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి అచ్చెన్నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు గల కారణాలు తక్షణమే తెలియచేయాలని అధికారులను ఆదేశించారు

## తనయుడికి తల్లి తలకొరివి






4లో

## రేషన్ పంపిణీలో జాప్యం వద్దు

* ఒక్క ఫిర్యాదు కూడా రాకూడదు
* సాంకేతిక సమస్యలు లేకుండా చూడాలి
* జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# రేపటి నుంచి జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ పొదుపు అవగాహన ర్యాలీలు జిల్లా, డివిజన్ కేంద్రాల్లో నిర్వహిస్తామన్నారు. విద్యుత్ పొదుపుపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక మహిళా బృందాలతో ముగ్గుల పోటీలు నిర్వహించి, వారికి ఇంధన సంరక్షణ పద్ధతులు, స్టార్ రేటెడ్ గృహోపకరణాల ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. విద్యుత్ పొదుపు ఆవశ్యకత గురించి వినియోగదారులతో అన్ని విద్యుత్ కార్యాలయాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# మీడియాపై దాడులు హేయం







**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** దేశవ్యాప్తంగా పాత్రికేయులపై దౌర్జన్యాలు, దాడులు, అవమానకర సంఘటనలు పెరగడంపై నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ ఇండియా (ఎన్‌యూజే) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలో ప్రముఖ పాత్రికేయ సంఘమైన ఎన్‌యూజే జాతీయ కార్యవర్గ సమావేశాలు జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ (జాప్ )ఆధ్వర్యంలో బుధవారం విజయవాడలో జరిగాయి. విజయవాడ క్లబ్‌లో ఎన్‌యూజే జాతీయ అధ్యక్షుడు రాస్‌బిహారీ అధ్యక్షతన జరిగిన సమావేశం ఈశాన్య, దక్షిణాది రాష్ట్రాల్లో పాత్రికేయులపై దాడులు జరగటంపై విచారం వ్యక్తం చేసింది. తాజాగా సినీ నటుడు మోహన్‌బాబు పాత్రికేయులపై దాడులకు దిగటాన్ని సమావేశం తీవ్రంగా ఖండించింది. భవిష్యత్తులో దాడులు జరగకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానాన్ని ఆమోదించింది.

**నకిలీ వార్తలపై అప్రమత్తం**

నకిలీ వార్తలు మీడియా ముందున్న అతిపెద్ద సవాలు అని ఎన్‌యూజే అభిప్రాయపడింది. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాలతోపాటు అనేక సామాజిక ప్లాట్‌ఫారమ్‌లలో స్వార్ధ ప్రయోజనాలతో ఉన్న వ్యక్తులు ఫేక్, వెరిఫై చేయని వార్తలను ఏ సమయంలోనైనా వైరల్ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. ఫేక్, బోగస్ న్యూస్ మునుపెన్నడూ చూడని సవాల్ అని, ఇది విశ్వసనీయత ఉన్న జర్నలిస్టులకు శాపంగా మారిందని పేర్కొంది. నకిలీ, బూటకపు వార్తల నుంచి మీడియాను రక్షించడానికి, దాని విశ్వసనీయతను కాపాడటానికి జర్నలిస్టు సంస్థలు చేతులు కలపాలని పిలుపునిచ్చింది. నకిలీ బోగస్ వార్తలు అరికట్టేందుకు మీడియా హౌసులతో పాటు పాత్రికేయ సంఘాలు ముందుకు రావాలని తీర్మానించింది. జాతీయస్థాయిలో ప్రెస్ కౌన్సిల్ స్థానంలో మీడియా కౌన్సిల్ ఏర్పాటు చేయాలని మరో తీర్మానంలో కోరింది. ఎన్‌యూజే జాతీయ ప్రధాన కార్యదర్శి మనోజ్ తివారి తీర్మానాలను ప్రవేశపెట్టారు.

**రాష్ట్రంలో పాత్రికేయుల సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి..**

ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలో కూడా గతంలో ప్రభుత్వాలు అమలు జరిపిన పాత్రికేయ సంక్షేమ కార్యక్రమాలను పునరుద్ధరించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండివీఎస్ఆర్ పున్నంరాజు కోరారు. అక్రిడేషన్ల మంజూరు, ఆరోగ్య బీమా అమలు, పాత్రికేయులకు ఇళ్ల స్థలాల వంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల స్థలాల మంజూరుకు సంబంధించి ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పాత్రికేయులకు శరాఘాతంగా మారిందని, ప్రభుత్వాలు దీనిపై పునరాలోచన జరిపి కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని జాప్ ప్రధాన కార్యదర్శి ఎం.యుగంధర్ రెడ్డి కోరారు. ఎన్‌యూజే ఉపాధ్యక్షుడు శివకుమార్ దేశవ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. దేశవ్యాప్తంగా 20 రాష్ట్రాలకు చెందిన ఎన్‌యూజే ప్రతినిధులతో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన జాప్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయండి

**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్‌అహ్మద్‌మౌలానా అన్నారు. గురువారం ఆయన జిల్లా కోర్టు భవనంలో జిల్లాలోని న్యాయమూర్తులతో ఆన్‌లైన్‌లో సమావేశం నిర్వహించారు. డిసెంబర్14న జరగనున్న లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయమని కోరారు.

కార్యక్రమంలో ఒకటో అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు, 3 వ అదనపు జిల్లా జడ్జి వివేక్ ఆనంద్ శ్రీనివాస్, 4వ అదనపు జిల్లా జడ్జి ఎస్ఎం ఫణికుమార్, జిల్లా కార్యదర్శి న్యాయ సేవాధికార సంస్థ ఆర్.సన్యాసి నాయుడు, న్యాయవాదులు పాల్గొన్నారు. గురువారం నిర్వహించిన ప్రీ లోక్ అదాలత్‌లో ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ నుంచి రెండు కేసులు పరిష్కారమయ్యాయి.



# పశు గణనను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**మందస, డిసెంబర్ 12(వార్త):** పశు సంవర్ధక శాఖ సిబ్బంది గ్రామాల్లో చేపడుతున్న అఖిల భారత పశుగణనను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మురళీధర్ కోరారు. గురువారం ఆయన మందస పశు చికిత్సాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, పశుగణన ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ సిబ్బంది ఇంటింటికీ వచ్చి పశువుల సమగ్ర సమాచారం సేకరిస్తారన్నారు. జిల్లాలోని 1586గ్రామాల్లో 5,88,090 కుటుంబాలకు చెందిన పశుగణన చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,95,786 కుటుంబాల్లో పూర్తయిందని తెలిపారు. పాడి రైతులు పశుగణన చేసే సిబ్బందికి సహకరించి పశువుల పూర్తి సమాచారం అందిస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాల రూపకల్పన, పశువులకు టీకాలు వేయడం వీలవుతుందని తెలిపారు. బహువార్షిక పశుగ్రాసం సాగు చేసే రైతులకు ప్రభుత్వం సహకారం అందించాలని నిర్ణయించిందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసే రైతుకు రూ.6599లు, 50 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసే రైతుకు రూ.32,992ల చొప్పున ఉపాధి నిధులు చెల్లిస్తుందన్నారు. ఉపాధి హామీ ద్వారా నిర్మిస్తున్నటువంటి మినీ గోకుల షెడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జిల్లా పశుగణన పర్యవేక్షణ అధికారి డాక్టర్ జి.నారాయణరావు, పలాస ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పి.చంద్రశేఖరరావు, మందస పశు వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది ధనుంజయరావు, కూర్మారావు, నేతాజీ, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.





## విద్యార్థులకు అకౌంటింగ్‌పై శిక్షణ

**పాలకొండ, డిసెంబర్ 12(వార్త):** నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల అకౌంటింగ్ టాక్సేషన్ విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జనచేతన సంస్థ డైరెక్టర్ బగాది శశిభూషణ చౌదరి తెలిపారు. ఆన్ ద జాబ్ ట్రైనింగ్‌లో భాగంగా అకౌంటింగ్ నైపుణ్యాలు, ఆడిటింగ్ ప్రాథమిక భావనలు, ఓచర్ల తయారీలో మెలుకువలు నేర్పించామన్నారు. అకౌంటింగ్ ఓచర్ల వెనుక పత్రసహిత సాక్ష్యాలైన రశీదులు, ఇన్వాయిసుల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రిన్సిపాల్ సురవరపు సత్యనారాయణ సూచనతో పాలకొండలో ఒకరోజు శిక్షణ నిర్వహించామని అధ్యాపకులు దుగ్గివలస రాంప్రసాద్, కొర్రాయి రవి తెలిపారు.

## వన్‌దన్ వికాస కేంద్రాలతో గిరిజనులకు మేలు



**మందస, డిసెంబర్ 12(వార్త):** వన్‌దన్ వికాస కేంద్రాల నిర్వహణ, అటవీ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ద్వారా గిరిజనులకు అధిక ఆదాయం లభిస్తుందని ఐటీడీఏ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. మందస మండలంలోని కొంకడాపుట్టిలో గురువారం ఏర్పాటు చేసిన వన్‌దన్ వికాస కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో లభ్యమైన చిరుధాన్యాలు సేకరించి వన్‌దన్ వికాస కేంద్రం ద్వారా అందించిన మిషనరీ ద్వారా పిండిగా తయారు చేసి మంచి ప్యాకింగ్, బ్రాండింగ్‌తో మార్కెటింగ్ నిమిత్తం డిజిటల్ కామర్స్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్ చిచ్చుల తారకమోహన్, వీవోఏలు, గ్రామ సంఘం, వీడీవీకే ప్రతినిధులు పాల్గొన్నారు.

## టీడీపీ హయాంలోనే గ్రామాలాభివృద్ధి



**కోటబొమ్మాళి, డిసెంబర్ 12(వార్త):** తెలుగుదేశం హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ అన్నారు. గురువారం ఆయన నిమ్మాడ పంచాయతీ తులసిపేట గ్రామంలో పలు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వైకాపా హయాంలో గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాఠశాలలను సందర్శించిన ఎంఈవో

**వంగర, డిసెంబర్ 12(వార్త):** యూకే గుమ్మడ జిల్లా పరిషత్ పాఠశాల, చిన రాజులగుమ్మడ ఎంపీపీఎస్ పాఠశాలను ఎంఈవో వై.దుర్గారావు గురువారం సందర్శించారు. విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. పాఠశాలల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. భోజనం రుచికరంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను ముందుకు తీసుకెళ్లేలా ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం
శుక్రవారం 13 డిసెంబర్ 2024


# ధాన్యం విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


**కోటబొమ్మాళి, డిసెంబర్ 12(వార్త):** ధాన్యం విక్రయాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని టెక్కలి ఆర్‌డీవో ఎన్.కృష్ణమూర్తి అన్నారు. గురువారం ఆయన వాండ్రాడ గ్రామంలో రైతులు విక్రయిస్తున్న ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్ వరి సాగు సక్రమంగా మంచి నాణ్యమైన పంట పండిందని, దీనికి వాతావరణం కూడా సహకరించిందన్నారు. అందుకే రైతులు ధాన్యంలో ఎటువంటి తేమ లేకుండా ఎండబెట్టి విక్రయించాలని ఆయన సూచించారు. పంట దిగుబడి, తదితర అంశాలను రైతులకు అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు అదే పంచాయతీ నర్సింగపల్లిలో ల్యాండ్ కన్వర్షన్లు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## తనయుడికి తలకొరివి పెట్టిన తల్లి

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 12(వార్త):** ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ రోడ్డు చక్రపాణి వీధికి చెందిన లక్ష్మీరెడ్డి రాజు(33)అనారోగ్యంతో బుధవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. మృతుడికి ఇద్దరు పిల్లలు సిరి(11), ఓంకార్(5), భార్య రోజా, తల్లి రమ ఉన్నారు. అందరితో కలివిడిగా ఉండే అతను చనిపోవడంతో ఆ ప్రాంతంలో తీవ్ర విషాదం నెలకొంది. మగ దిక్కు లేకపోవడంతో కుమారుడి చితికి తల్లి రమ నిప్పంటించి దహన సంస్కారాలు నిర్వహించారు.

## ఆదిత్యుడిని దర్శించుకున్న విజయభారతి



**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** ప్రత్యక్షదైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామిని గురువారం జాతీయ మానవహక్కుల కమిషన్ చైర్‌పర్సన్ విజయభారతి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. వీరికి స్వామి వారి ప్రసాదాలను, జ్ఞాపికను అందజేశామని ఆలయ ఈవో వై.భద్రాజీ తెలిపారు.

## గ్రీవెన్స్‌తోనే ప్రజా సమస్యల పరిష్కారం



**పలాస, డిసెంబర్ 12 (వార్త):** ప్రజా సమస్యల పరిష్కారానికే గ్రీవెన్స్ ఏర్పాటు చేశామని ఏపీటీపీ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు అన్నారు. గురువారం విజయవాడలో గల రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా సమస్యలపై గ్రీవెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శాసనమండలి విప్ పంచుమర్తి అనురాధ, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వినతులు పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

## పారిశుధ్య సమస్యను పరిష్కరించండి

**మందస, డిసెంబర్ 12(వార్త):** మందసలో పారిశుధ్య సమస్యలు స్థానికులను వేధిస్తున్నాయని, వీటిని తక్షణమే పరిష్కరించాలని జనసేన పార్టీ నాయకులు దిలీప్ కుమార్ పాణిగ్రాహి, గుసిరి కిరణ్ కుమార్, బమ్మిడి మహేష్ ఎంపీడీవో పైల సూర్యనారాయణను కోరారు. మందసలోని మురుగు సమస్యల ఫొటోలతో సహా వినతిపత్రాన్ని అందించారు. డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించాలన్నారు. ముఖ్యంగా మెయిన్ రోడ్డు, కరణం వీధిలో నెలకొన్న పారిశుధ్య సమస్యలు, మందస మెయిన్ రోడ్డు, రాజావీధి నుంచి బోయవీధి రోడ్డులో ఇసుక పేరుకుపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, రోడ్డును తక్షణమే శుభ్రం చేయాలని విన్నవించారు.



# చంద్రబాబు అభివృద్ధి ప్రదాత : కోండ్రు





**వంగర, డిసెంబర్ 12(వార్త):** ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి ప్రదాత అని రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. గురువారం ఆయన బంగారువలసలో శ్రీకృష్ణా రైస్ మిల్లును ప్రారంభించారు. కొప్పరవలసలో రూ.9.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజాం నియోజకవర్గంలోని రోడ్ల గుంతలు పూడ్చేందుకు నాలుగు కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోండ్రు జగదీశ్, బొత్స వాసుదేవరావు నాయుడు, పైల వెంకటరమణ, మజ్జిగణపతి, బలిజిరెడ్డి శ్రీనివాసరావు, లచ్చుభుక్త కృష్ణ, వి.మురళీకృష్ణ, మోహన్, బెజ్జిపురపు త్రినాథ, బెజ్జిపురపు రవి, గురవాన నారాయణరావు, సంగమేశ్వర ఆలయ చైర్మన్ బోను ఆనందరావు, రామారావు, తహసీల్దార్ ధర్మరాజు, ఎలక్ట్రికల్ ఏఈ సాంబశివరావు, డీటీ రామారావు, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

### మండల సిబ్బందిపై మండిపాటు

వంగర మండల పర్యటనలో భాగంగా మండల పరిషత్ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్యే మురళీమోహన్ సందర్శించారు. అక్కడి సిబ్బంది పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో ఎం.త్రినాథరావు, జూనియర్ అసిస్టెంట్ కిశోర్ తదితరులను హెచ్చరించారు. పనులపై నిర్లక్ష్యం వహించడం తగదని, ఇష్టం లేకుంటే వేరే చోటకు వెళ్లిపోవాలని వారికి స్పష్టం చేశారు.

### నీటి సంఘాల ఎన్నికలపై సమీక్ష

**రాజాం:** శ్యాంపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ నీటి సంఘాల ఎన్నికలపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎన్నికలను సజావుగా నిర్వహించుకోవాలని కూటమి నాయకులకు సూచించారు. అంతకుముందు ఆయన రాజాం–శ్రీకాకుళం రహదారి మరమ్మతు పనులను పరిశీలించారు.

# విజయమే లక్ష్యం కావాలి

### ఎమ్మెల్యే కూన రవికుమార్

**ఆమదాలవలస, డిసెంబర్ 12 (వార్త):** సాగు నీటి సంఘాల ఎన్నికల్లో విజయమే లక్ష్యం కావాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సాగునీటి సంఘాల ఎన్నికలపై ఆమదాలవలస నియోజకవర్గ ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లో మండలాల్లోని అన్ని టీసీలను గెలిపించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు చేస్తున్న సేవలను వివరించాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు సనపల ఢిల్లేశ్వరరావు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, గొండు రమణ, చేపేన సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.



## బైక్ గ్యారేజీలో మంటలు

**కొత్తూరు, డిసెంబర్ 12 (వార్త):** కొత్తూరు పట్టణంలోని పాలకొండ రోడ్డులో పైల భాస్కరరావుకు చెందిన మెకానిక్ గ్యారేజీలో గురువారం తెల్ల వారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 15 ద్విచక్ర వాహనాలు, కర్రలు కోసే మిషన్లు, నూతన స్ప్రేయర్లు, ఆటో మొబైల్స్ సామగ్రి, బ్యాటరీలు, ఇంజన్ ఆయిల్ మాడిమసైపోయాయి. సుమారు రూ.16 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్టు యజమాని తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

# గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**మందస, డిసెంబర్ 12(వార్త):** గిరిజన సంక్షేమ పరిరక్షణ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక మందస మండలంలోని బంసుగాంలో గురువారం నిర్వహించారు. అధ్యక్షుడిగా సవర నరసింగరావు, ఉపాధ్యక్షులుగా సవర దాశరథి, లక్ష్మణరావు, నరసింహులు, చిన్న, కార్యదర్శిగా సవర జగ్గారావు, ఉపకార్యదర్శిగా యేసయ్య, గౌరవ అధ్యక్షునిగా సవర సుధాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు గిరిజన గ్రామాల్లో పర్యటించి, గిరిజనుల నుంచి పలు సమస్యలు సేకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గిరిజన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న అడవుల్లో గ్రానైట్ తవ్వకాలు నిలిపివేయాలని, గ్రామాలలో సీసీ రోడ్లు, సొండోడి కొట్టు నుంచి గంద్రుగాం బస్టాప్ వరకు పాడైపోయిన తారురోడ్డునకు మరమ్మతులు చేయాలని, బంసుగాం గ్రామంలోని సవర నాగేష్ ఇంటి నుంచి చాపరాయి వీధి మీదుగా జన్నివీధి వరకు తారు రోడ్డు మంజూరు చేయాలని కోరారు. బంసుగాంలో డ్రైనేజీ, స్కూల్‌కు ప్రహరీ మంజూరు చేయాలని, బలియాగాం గ్రావిటీ వాటర్ మరమ్మతు, సీసీ రోడ్, పాడైపోయిన స్కూల్ భవనం తొలగించి కొత్తగా భవనం మంజూరు చేయాలన్నారు. కుసుమాలలో సీసీ రోడ్ తదితర సమస్యలను అధికారులు పరిష్కరించాలని కోరారు.

## ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో..
# చైల్డ్ హెల్ప్ లైన్‌పై అవగాహన



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 12 (వార్త):** ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్‌లో గురువారం రాత్రి చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దొంగల నుంచి రక్షణ, బాలికల రక్షణ, చైల్డ్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పించారు. తప్పిపోయిన బాలురు, ఇంటి నుంచి పారిపోయిన బాలలు కనిపిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 కు తెలపాలని సూచించారు. ప్రయాణికులకు రైల్వే ఎంక్వయిరీ 139 టోల్‌ఫ్రీ నెంబర్ గురించి వివరించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మీనాక్షిమహాపాత్రో, ఏఎస్ఐ సంతోష్ పాణిగ్రాహి, బీడీ రావు, సంతోష్, మాల్యాకుమార్‌నాయక్, జాస్మిన్‌కుమారి పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**వంగర, డిసెంబర్ 12(వార్త):** వంగర మండలంలో చెట్లు, కొమ్మలను తొలగించడం కోసం శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు గురువారం తెలిపారు. ఉదయం 7 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు. వంగర సబ్‌స్టేషన్ పరిధిలో గల శివ్వాం, ఎం.సీతారాంపురం, మద్దివలస, కొప్పరకొప్పరవలస, కొండచాకరాపల్లి, కొట్టిశ, లక్ష్మింపేట, తలగాం, రుషింగి, బంగారువలస, కొత్తవలస, రాజులగుమ్మడ, చినరాజుల గుమ్మడ, వీవీఆర్ పేట, జేకే గుమ్మడ, బంగారువలస తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. ఈ విషయాన్ని గమనించి, ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

# రేషన్ పంపిణీలో జాప్యం వద్దు

### -జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీని వేగవంతం చేసి, అర్హులైన తెల్ల రేషన్ కార్డుదారులకు సకాలంలో అందజేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు, వేర్ హౌసింగ్ గొడౌన్ ఇన్‌చార్జిలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బియ్యం పంపిణీలో ఎటువంటి సాంకేతిక సమస్యలు ఉన్నా వెంటనే పరిష్కరించాలన్నారు. కార్డుదారుల ఇళ్ల వద్దకు బియ్యం సరఫరా చేయాలన్నారు. జిల్లాలో రేషన్ సరకుల పంపిణీ సక్రమంగా జరగడం లేదన్న ఫిర్యాదు ఒక్కటి కూడా లేకుండా పని చేయాలన్నారు. గిరిజన ప్రాంతాలకు సైతం రేషన్ సకాలంలో అందాలని సూచించారు. సమావేశంలో పౌరసరఫరాల సంస్థ మేనేజర్ టి.వేణుగోపాల్, జిల్లా పౌరసరఫరాల అధికారి జి.సూర్య ప్రకాష్, పలువురు సీఎస్ డీటీలు తదితరులు పాల్గొన్నారు.



# రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలి

### -సీడీపీవో విమలారాణి

**మెళియాపుట్టి డిసెంబర్ 12(వార్త):** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని పాతపట్నం సీడీపీవో విమలా రాణి ఆయా అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. గురువారం ఆమె దీనబంధుపురం, మెళియాపుట్టి, గేదెల పోలూరు తదితర అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కేంద్రాల్లోని చిన్నారులు ఆడుకుంటూ విద్య నేర్చుకునేలా బోధించాలని సూచించారు.

ఫజిల్‌గేమ్స్, ఆటలు ఆడేలా చూడాలన్నారు. చిన్నారుల సంఖ్య, వయస్సు, బరువు వంటి వివరాలను టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. పరిశుభ్రమైన, పౌష్టికాహారం అందించాలని, ఆయా కేంద్రాల్లో పిల్లలకు ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని వసతులు కల్పించాలన్నారు. ప్రభుత్వం అందించే సరుకులకు రికార్డుల్లో ఉన్న సరుకు వివరాలను పరిశీలించారు. ఆమె వెంట అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.



# భక్తిశ్రద్ధలతో గ్రామాల్లో లక్ష్మీదేవి, గో పూజలు





**మందస, డిసెంబర్ 12(వార్త):** పలు గ్రామాల్లో మార్గశిర గురువారం పురస్కరించుకుని మహిళలు లక్ష్మీ పూజలను భక్తిశ్రద్ధలతో జరిపారు. ముందు రోజే ఇళ్లను శుభ్రపరుచుకుని, వేకువన మేల్కొని, తలంటుకుని, ఇళ్లను చక్కగా అలంకరించుకున్నారు. గోమాతలకు పూజించి, పిండి వంటలు, ప్రసాదాలను ఇంటింటికీ పంచిపెట్టారు. మూలిపాడులో సర్పంచ్ గుసిరి వెంకటరావు, సరస్వతి దంపతులు ఆవులను పూజించి, ప్రసాదాలు భక్తులకు అందించారు.

## మీటింగ్ హాల్ మరమ్మతులకు అంచనాలు పంపండి

**మెళియాపుట్టి, డిసెంబర్ 12(వార్త):** మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్ మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని ఇంజనీరింగ్ అధి కారులకు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రసాద్ సూచించారు. మీటింగ్ హాలు శ్లాబ్ పెచ్చులూడిపోతూ ఇబ్బందికరంగా మా రుతుండడంతో గురువారం ఆయన ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, మీటింగ్ హాలును పరిశీలించారు. వెంటనే మరమ్మతులు చేయించే దిశగా చూడాలని, అంచనాలు తయారు చేసి తమకు పంపించాలని పంచాయతీరాజ్ ఏఈ ఆనంద్‌కు సూచించారు. ప్రస్తు తానికి సమావేశ మందిరం లేక అధికారులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో సమావేశం మందిరాన్ని వెంటనే పునర్నిర్మానం చేపట్టడానికి కృషి చేస్తా మన్నారు. ఆయన వెంట ఎంపీడీవో నరసింహ ప్రసాద్ పండా, వర్క్ ఇన్‌స్పె క్టర్ చిన్నారావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.




## పది ఇసుక ట్రాక్టర్లు సీజ్

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్12 (వార్త):** ఎచ్చెర్ల మండలం తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ నుంచి జాతీయ రహదారిపై వెళుతున్న పది ఇసుక ట్రాక్టర్లను అధికారులు గురువారం అడ్డుకున్నారు. తహసీల్దార్ ఎం.సింహాచలంతో కూడిన రెవెన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది వాహనాలను నిలిపివేశారు. తమ్మినాయుడుపేట ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్లు ద్వారా ఇసుక తరలించి, సమీపంలో పోగులు వేస్తున్నారని, విశాఖపట్నం అర్ధరాత్రి ఇసుక లారీలు, టిప్పర్లలో తరలిస్తున్నారని ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యా దులు వెళ్లాయి. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్ బృందాలు దాడులు చేశాయి. ఇసుక తరలిస్తున్న వారు, స్థానికులు అధిక సంఖ్యలో చేరుకుని పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం నిబంధనల మేరకు మాత్రమే తాము ఇసుక తరలిస్తున్నామని, రీచ్‌లలో కూలీలతో ట్రాక్టర్‌లో లోడింగ్ చేసి తీసుకెళ్తున్నామని చెప్పారు. అయితే ఇసుక అక్రమంగా పోగులు వేస్తున్నారని, నిరంతరం అక్రమ రవాణా సాగుతోందని అధికారులు అన్నారు. ఉచితం ముసుగులో అక్రమంగా పోగులు వేస్తే కేసులు పెడతామని హెచ్చ రించారు. మైన్స్ అధికారులకు దీనిపై సమాచారం ఇచ్చి, పది ట్రాక్టర్లను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

## బహుళ పంటలు సాగు చేయండి

**శ్రీకాకుళం, డిసెంబర్ 12(వార్త):** తమ్మినాయుడుపేట గ్రామానికి చెందిన రైతు రామారావు పొలంలో చేపట్టిన బహుళ పంటల విధానాన్ని గురువారం వ్యవసాయ అధికారి హేమసుందర్ పరిశీలించారు.




## మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**ఆమదాలవలస, డిసెంబర్ 12(వార్త):** మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ పిలుపునిచ్చారు. ఆమదాలవలసలోని వెంకటేశ్వర ఐటీఐ విద్యార్థులకు మత్తు పదార్థాల వినియోగంతో కలిగే నష్టాలపై గురువారం ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువులో రాణించి తల్లిదండ్రులు ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేయాలన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కూన బోనాల జీరావు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**పలాస, డిసెంబర్12(వార్త):** ఉలాసపేటలో ఇటీవల మృతి చెందిన కొవ్వూరు మల్లేశ్వరరావు కుటుంబానికి పలాస విద్యుత్ శాఖ ఉద్యోగి పినకాన సాయిరాం గురువారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించి తన మంచి మనుసును చాటుకున్నారు. కార్యక్రమంలో పలాస డివిజన్ కార్యదర్శి గార రాజారావు, కమ్యూనికేషన్ కార్యదర్శి భాస్కరరావు, లైన్‌మెన్లు జోగారావు, కళ్యాణ్, సంపతిరావు రవికిరణ్, జూనియర్ లైన్‌మన్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయండి



**పలాస, డిసెంబర్ 12(వార్త):** శ్రీకాకుళం కలెక్టరేట్ ఎదుట శుక్రవారం రైతు సమస్యలపై వైసీపీ చేపట్టబోయే ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయా లని ఆ పార్టీ పలాస మండల అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు రైతులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా నేతలంతా ఈ ఆందోళనలో పాల్గొంటామన్నారు. రైతాంగం, ప్రజా సంఘాలు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు

## చేపల పెంపకంపై అవగాహన

**సంతబొమ్మాళి, డిసెంబర్ 12(వార్త):** వడ్డితాండ్రలో జగన్నాథస్వామి మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘ సభ్యులు, మత్స్యకార మహిళలకు చేపల పెంపకంపై గురువారం మత్స్యశాఖ పలాస ఏడీ సత్యనారాయణ, ఎఫ్డీవో ధర్మరాజు అవగాహన కల్పించారు. ఆకాశలక్కవరంలో కట్టును సందర్శించి సభ్యులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ టీం సభ్యులు, మత్స్యకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.




Printed and published and Owner by Shaik Sahid, printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546